క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఎముకలకు సంబంధించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కైరా ఎమర్జన్సీ అండ్ ట్రామా సెంటర్‌కు చెందిన వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎముకలకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, మహిళలకు సంబంధించిన పరీక్షలు, సుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్లు టి.వెంకటభార్గవ్, కర్రి నిరూప, సీహెచ్ అజయ్‌రాకేష్, నంబారు స్నేహ, ఆశా రమ్యా శ్రీపాటిలో పాల్గొంటారని తెలిపారు.

సామర్లకోటలో అన్నదానం


సత్తెమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం

సామర్లకోట: స్థానిక చంద్రశేఖరస్వామి ఆలయం, పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మట్టపల్లి వారి వీధిలో ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన శరన్నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో ఆలయ కమిటీ నాయకులు అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు, సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేసినట్టు కమిటీ నాయకులు తెలిపారు. కమిటీ నాయకులు ఆశపు నూక రాజు, ఈశ్వరప్రసాద్, దన్నిన శ్రీహరి, అల్లంపల్లి మణి కంఠ, సాయికిరణ్, ధన్నిన దుర్గ, రాజేష్, కర్రి అప్పలరాజు, శెట్టిబత్తుల దుర్గారావు సేవలందించారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన


పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

సామర్లకోట: సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌లో భాగంగా శనివారం రాత్రి విధుల అనంతరం తమ నిరసన తెలియజేశారు. పెద్దాపురం పట్టణ పరిధిలో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఇంటింటా సర్వే బాధ్యతల నుంచి తప్పించాలని, పదవోన్నతులు, ఇంక్రిమెంట్ల సమస్యలు పరిష్కరించాలని ప్లెకార్డులతో నినాదాలు చేశారు. గత వారం రోజులు గా నల్ల బాడ్జీలు దరించి విధులు నిర్వహిస్తున్న విషయం విధితమే. తమ సమస్యలు పరి ష్కరించక పోతే రాష్ట్ర యూనియన్ నిర్ణయం మేరకు ఈనెల పదో తేదీ నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని సచివాలయ ఉద్యోగులు తెలిపారు.

శాంపిల్స్‌కు నిరాకరణ


శాంపిల్స్ సేకరణకు రాబోమని అధికారులకు చెబుతున్న మత్స్యకారులు

కొత్తపల్లి: తీర ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో సముద్ర జలాలు కలుషితమవుతున్నాయంటూ మత్స్యకారులు ఇటీవల ఆందోళన చేసిన నేపథ్యంలో శాంపిల్స్ సేకరణకు పలువురు అధికారులు శనివారం అమీనాబాదు ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లారు. జిల్లా మత్స్యశాఖ అధికారులు, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ సభ్యులు హార్బర్‌కు వెళ్లారు. తొండంగి మండలంలో నిర్మించిన లైపిస్‌కు సంబంధించి సముద్రంలోకి వేసిన పైపులైన్ అవుట్‌లెట్ వద్ద శాంపిల్ తీసుకునేందుకు మత్స్యకారులతో కలిసి బోటుపై వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, పవన్ కల్యాణ్ వచ్చి న్యాయం చేసేంత వరకూ శాంపిల్స్ సేకరించేందుకు తాము రాబోమని మత్స్యకారులు చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు, ఏడీ కరుణాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ఆటో డ్రైవర్ల సేవా పథకాన్ని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక గడియారం సెంటర్‌లో ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

కల నెరవేరేనా..!

- పెద్దాపురంలో మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయం
- స్థలం కేటాయించిన మున్సిపాలిటీ
- భవనం నిర్మించిన దాతలు
- అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన పనులు



భవనం ప్రారంభోత్సవ శిలాఫలకం

సామర్లకోట: విజ్ఞానం, వినోదం అందించే మ్యూజియం ఏర్పాటు పెద్దాపురం ప్రజల కలగా మారింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోనే మున్సిపల్ పార్కులో మ్యూజియంను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపాలిటీ స్థలం కేటాయించడంతో బచ్చుఫౌండేషన్ అధినేతలు ముందుకు వచ్చి సుమారు రూ.కోటితో 2009లో భవనం నిర్మాణం చేశారు. ఈ భవనాన్ని అప్పటి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు ప్రారంభించారు. ఈ మ్యూజియంలో జిల్లాతోపాటు దేశ వ్యాప్తంగా కనుగొన్న చారిత్రాత్మక పరికరాలు మ్యూజియంలో ఉంచాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు మ్యూజియంపై శ్రద్ధ చూపిన దాఖలాలు కనిపించడంలేదు. మ్యూజియం ప్రారంభించి పర్యాటక పురావస్తు శాఖ అధికారులకు అప్పగించగా వారి నిర్లక్ష్యం కారణంగా అందుబాటులోకి రాకుండాపోయిందని ఆరోపణలు ఉన్నాయి.


పెద్దాపురం మున్సిపల్ పార్కు వద్ద మ్యూజియం కోసం నిర్మించిన భవనం

కలగా మిగిలిన ఆనందం

మ్యూజియంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, రాజులకు చెందిన విషయాలు, రాజకీయ అంశాలు, పురావస్తు శాఖకు సంబంధించిన అనేక చిత్ర పటాలు, విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటు ఆయా రాష్ట్రాలో ఉన్న ప్రసిద్ధి రూట్ మ్యాప్‌ను కూడా రూపొందించి ప్రజలు సులభంగా ఆయా క్షేత్రలను దర్శించుకునేలా ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే పెద్దాపురం మున్సిపాలిటీ, పురావస్తు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా మూజియం ప్రజలకు అందుబాటులోకి రాలేదని వాదనలు ఉన్నాయి. ఈ మ్యూజియంలో ప్రతి జాతీయ నాయకునికి సంబంధించిన జీవిత చరిత్ర, పురాతన కట్టడాలు, వాటి నిర్మాణానికి సంబంధించిన అంశాలతో చరిత్రతో కూడిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మ్యూజియం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు విజ్ఞానంతో పాటు వినోదం కలుగుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే వారి ఆనందం కలగానే మిగిలిపోయింది.

బాధ్యత మున్సిపాలిటీదే..

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉన్న స్టారికల్ మ్యూజియంను తెరిపించాల్సిన బాధ్యత కూడా మున్సిపాలిటీపైనే ఉందనే వాదనలు ఉన్నాయి. మ్యూజియం భవనం నిర్మాణం చేసిన స్థలంలో మున్సిపల్ పార్కు ఉండడంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అనేక మంది పార్కులో కాలక్షేపం చేస్తున్నారు. ఈ మున్సిపల్ పార్కు సమీపంలోనే పెద్దాపురం గ్రంథాలయం ఉండడంలో గ్రంథాలయానికి వచ్చిన వృద్ధులు, ఆ పార్కులో విశ్రాంతి తీసుకొంటున్నారు. మ్యూజియం వినియోగంలోనికి తీసుకుకొని వస్తే బావితరాల వారికి విజ్ఞానం పెరుగడంతోపాటు దాత ఆశయం నెరవేరుతుంది.

అధికారుల నిర్లక్ష్యం



మున్సిపాలిటీ ముందుకు వచ్చి లక్షల రూపాయల విలువ చేసే స్థలం మ్యూజియంకు కేటాయించింది. దాత మ్యూజియం భవన నిర్మాణం చేసి 15 ఏళ్ల పూర్తయింది. అయినా అధికారులు ఇప్పటి వరకు మ్యూజియంకు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. ముఖ్యకూడలి ప్రదేశంలో మ్యూజియం ఉంటే బాగుంటుంది. అధికారులు దానిపై దృష్టి సారించాలి.

– వానంశెట్టి గంగ, మాజీ కౌన్సిలర్, పెద్దాపురం

పురావస్తు శాఖకు లేఖ రాస్తాం



దాత సహకారంతో నిర్మించిన మ్యూజియం భవనాన్ని పురావస్తు శాఖకు స్వాధీనం చేశారు. అయితే ఆ శాఖాధికారులు ఇప్పటి వరకు దానిపై ఎటువంటి శ్రద్ధ చూపలేదు. భవనాన్ని ఉపయోగించకపోవడం వలన పాడైపోయే అవకాశం ఉంది. మ్యూజియం ప్రజలకు ఉపయోగపడేలా వినియోగంలోనికి తీసకు రావాలని పురావస్తు శాఖ అధికారులకు మున్సిపాలిటీ తరుపున లేఖ రాస్తాం.

– నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్, పెద్దాపురం

స్త్రీనిధిలో అవకతవకలపై విచారణ


విచారణకు హాజరైన మహిళా సంఘాల సభ్యులు

సామర్లకోట: మహిళా సంఘాలకు చెందిన స్త్రీనిధిలో అవకతవకలు జరిగాయనే జిల్లా కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం వెలుగు ఏపీఎం సీహెచ్ జగదీశ్వరీ ఆధ్వర్యంలో విచారణ చేశారు. మండల పరిధిలోని పంద్రవాడ గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యుల నుంచి యానిమేటర్ కొప్పిశెట్టి రామతులసీ వసూలు చేసిన సొమ్ము పక్కదారి పట్టినట్టు గుర్తించారు. మహిళా సంఘాల సభ్యులకు చెల్లించాల్సిన మొత్తం రూ.లక్షలతో ఉంటుందని గుర్తించారు. ఒక గ్రూపు పేరున తీసుకున్న బ్యాంకు రుణం మరో గ్రూప్ ఇవ్వడం వంటి అవకతవకలను గమనించారు. విచారణలో గుర్తించిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని జగదీశ్వరీ తెలిపారు. సంఘాలకు వచ్చిన రుణాలు పక్కదారి పట్టినట్టు గుర్తించామని చెప్పారు. కట్టించుకున్న సొమ్ములకు రసీదులు ఇవ్వడం లేదని గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సత్యకుమారి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీనిధికి సంబంధించి 23 నెలలు కట్టించుకోవాల్సి ఉండగా 24 నెలలు కట్టించుకోవడంతో గ్రామంలోని మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలని కలెక్టరుకు ఫిర్యాదు ఇచ్చినట్టు సత్యకుమారి తెలిపారు.

జీఎస్టీ రద్దు, తగ్గింపులపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ పద్మావతి

పెద్దాపురం(సామర్లకోట): కేంద్ర ప్రభుత్వం కొన్ని రకాల వస్తువులపై జీఎస్టీ రద్దు చేయడం, మరి కొన్ని వస్తువులపై జీఎస్టీ తగ్గించిందని, దానిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కాకినాడ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ పద్మావతి అన్నారు. శుక్రవారం పెద్దాపురం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జీఎస్టీ తగ్గిన వాటి వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అధ్యక్షత వహించగా కాకినాడ ఏపీ ఐఐసీ జోనల్ మేనేజరు రమణారెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు ఎస్.విజయ కుమార్, డిప్యూటీ జోనల్ మేనేజరు బి.రాధామణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జయలక్ష్మి థియేటర్ రోడ్డులో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు వినకోట సురేష్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆహారం తీసుకోకుండా హాజరు కావాలన్నారు.

దీపావళికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దీపావళి పండగ సందర్భంగా ఎటువంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా సురక్షితమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఇందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన దీపావళి పండగ ఏర్పాట్లపై అధికారులు, మున్సిపాలిటీ కమిషనర్లు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దీపావళికి ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌ను రూపొందించి, ప్రదర్శించాలని జేసీ అధికారులకు సూచించారు. అనుమతి లేకుండా ఎవరూ బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలు నిర్వహించకుండా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలు తనిఖీలు నిర్వహించాలన్నారు. పండుగ ముందు మూడు రోజుల పాటు మాత్రమే బాణసంచా విక్రయాలు, నిర్దిష్ట వేళల్లో అనుమతించాలని, ఇందుకు సురక్షితమైన, బహిరంగ ప్రదేశాలను ఈ నెల 15వతేదీ లోపున గుర్తించి, తాత్కాలిక అనుమతులు జారీ చేయాలని సూచించారు. ఒక్కో లేఅవుట్‌లో 50 షాపులకు మించి ఉండకూడదన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీ, ఫైర్ ఆఫీసర్, మండల స్థాయిలో తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఫైర్ సిబ్బంది అనువైన, సురక్షితమైన మైదానాలను పరిశీలించి, విక్రయ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించాలన్నారు. ఒక్కో షాపు కనీసం 3 మీటర్ల దూరంలో ఉండేలా చూడాలని, అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు సులువుగా సంచరించేందుకు వీలుగా 6 మీటర్ల వెడల్పు మార్గం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. బాణసంచా విక్రయదారులు అధిక ధరలతో వినియోగదారులను దోచుకోకుండా వాణిజ్య పన్నులు, లీగల్ మెట్రాలజీ అధికారులు ఎమ్మార్పీ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు.

ఎలక్ట్రిక్ కారులో మంటలు

కాకినాడ రూరల్: కాకినాడ 49వ డివిజన్ పరిధిలోని గైగోలుపాడు పైడా వారి వీధిలో ఒక ఇంట్లో పార్కింగ్ చేసిన కారు నుంచి వచ్చిన మంటలు వచ్చాయి. సకాలంలో మంటలు అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్.శ్రీహరిరాజు సుమారు రూ.46 లక్షలతో గత ఏడాది ఎలక్ట్రిక్ కారు కొనుగోలు చేశారు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద పార్కింగ్ చేసిన ఆ కారు నుంచి అనుకోకుండా మంటలు, దట్టమైన పొగ వచ్చింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. సుమారు రూ.15 లక్షలు నష్టం వాటిల్లి ఉంటుందని బాధితుడు తెలియజేసినట్టు అగ్నిమాపక అధికారి సుబ్బారావు తెలిపారు.


ఎలక్ట్రిక్ కారు నుంచి వచ్చిన మంటలతో వ్యాపించిన దట్టమైన పొగ

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కొత్తపల్లి: దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ అనుమతుల్లేకుండా అక్రమంగా బాణసంచా నిలువ చేసిన, తయారు చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా తయారు చేసేవారు కచ్చితంగా లైసెన్స్ ఉండాలన్నారు. నివాస గృహాల మధ్య, రద్దీ ప్రాంతాల్లో ఉంచకూడదన్నారు. దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, తహసీల్దారు పోలీసులు, పొల్యూషన్ శాఖలకు సంబంధించిన అనుమలుతు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వహకులే వహించాలన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతుల తప్పనసరి అని, గ్రామ రెవెన్యూ అధికారి పోలీసులతో దుకాణాల ఏర్పాటు పరిశీలన చేసిన తరువాత మాత్రమే నివేదికను ఉన్నతాధికారులకు అనుమతుల ప్రకారం మంజూరు చేశామన్నారు.

విద్యా వలంటీర్లకు దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలో విద్యా వలంటీర్లుగా పని చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ-2 పి.పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఎస్.కొత్తూరు, పెదపులి చెరువు ప్రాంతాలలో నివాసం ఉంటున్న ఎస్టీ కుటుంబాలకు చెందిన 21 మందికి విద్యా బోధన చేయడానికి సమగ్ర శిక్షణ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో గుడాలు వేసుకొని నివాసం ఉంటున్న వారి కుటుంబాలోని పిల్లల్లో సామర్థ్యం పెంచడానికి వలంటీర్లు కృషి చేయాలని చెప్పారు. ఈ మేరకు డిగ్రీతో పాటు బీఈడీ, ఇంటర్‌తో పాటు డీఈడీ అర్హత ఉన్న వారు ఈనెల 8వ తేదీ లోపుగా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఎంపికైన వలంటీర్లకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తున్నట్టు తెలిపారు.

బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్న ఏసీబీ కోర్టు జడ్జి


అమ్మవారి చిత్రపటాన్ని జడ్జి వెంకటేశ్వరరావుకు అందిస్తున్న ఈఓ వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారిని శనివారం రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు దర్శించుకొని పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు అందించారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి

పిఠాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన అవమానించిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందన్నారు. వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి పంచాయతీ జాలెంపల్లి గ్రామంలో టీడీపీ రౌడీ మూకలు ఉన్మాదంతో రెచ్చిపోయి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన అవమానించారన్నారు. పక్కా పథకం ప్రకారం ఈ ఘాతుకానికి ఒడిగట్టారని ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

సామర్లకోటలో..

సామర్లకోట: అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోలు పోసి నిప్పు పెట్టిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మాలమహానాడు జిల్లా కార్యదర్శి, బలుసులపేట అంబేడ్కర్ సంఘ గౌరవ అధ్యక్షుడు నేతల హరిబాబు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం, జాలెంపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరగడం దారుణమన్నారు. దోషులను పట్టుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలు ఎక్కడా జరుగకుండా ఉండేలా నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు రొట్టె అబ్బులు, కన్వీనర్ కుంచే జగన్, కోశాధికారి నేతల శ్రీనివారరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వేట్లపాలెం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో పీడీ తదితరులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్టు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టరు యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్‌ఏ గ్రౌండ్‌లో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బాలికలు, బాలురు పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదురుగు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎ.శ్రీధర్ 55 కేజీల విభాగంలోను, కె.గౌతమ్ 80 కేజీల విభాగంలోను, కె.ప్రవీణ్ 52 కేజీల విభాగంలోను, డి.హారిక 65 కేజీల విభాగంలోను, డి.సింధుష 62 కేజీల విభాగంలో ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ విద్యార్థులను ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, పాఠశాల హెచ్ఎ అనురాధ, విద్యాకమిటీ చైర్మన్ శివ, పీఈటీ ఎండీ ఇబ్రహీం అభినందించారు.

ఉత్సాహంగా ఊరేగింపులు


సామర్లకోట బల్లమార్కెట్ సెంటర్‌లో అమ్మవారి ఊరేగింపు

సామర్లకోట: పట్టణంలో శనివారం కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవ ఊరేగింపు ఉత్సాహంగా సాగాయి. శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లో అమ్మవారి శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఉంచి ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు. ఈ ఊరేగింపులో వివిధ దేవతామూర్తుల వేషధారణ, బ్యాండ్ మేళం, డప్పులు అందరిని ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా ప్రత్యేక శిబిరాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాలను ఊరేగించారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, కోమరగిరి, గొర్స, యండపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి కోనపాపపేట నుంచి ఉప్పాడ శివారు సబ్బంపేట సమీపంలో ఉన్న తీరప్రాంతంలో నిమజ్జనం చేశారు.


కొత్తపల్లిలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు


సీతంపేటలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

శంఖవరం: చిరు ధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక సీతంపేట యాదవ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన చిరుధాన్యాలపై మెగా మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ ఆహారభద్రత పోషణ మిషన్‌లో భాగంగా రైతులకు రాగి విత్తనాలు రాయితీపై అందజేసి నాణ్యమైన దిగుబడులతో పోషకాహారం పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు పండించిన చిరుధాన్యాలను మద్దతు ధరలతో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం చిరుధాన్యాల సాగుకు మేలైన యాజమాన్య పద్ధతులు అనే పుస్తకాన్ని విడుదల చేసి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్, జిల్లా వనరుల కేంద్ర సహయ వ్యవసాయ సంచాలకుడు డి.మాల కొండయ్య,మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

57 ఎకరాల ఆలయ భూమి కౌలుకు త్వరలో..

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థాన సత్రం భూముల కౌలు వేలంకు సంబంధించి వేలం ప్రక్రియ సక్రమంగా జరగలేదంటూ తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు సోమవారం 57 ఎకరాల భూమికి మరలా కౌలువేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థాన సత్రం అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్రంకు చెందిన 478 ఎకరాలకు మూడేళ్ల కాలపరిమితికి కౌలువేలం ప్రక్రియను గతంలో తొండంగి శివాలయంలో నిర్వహించారు. అప్పట్లో ఈవేలం ప్రక్రియ అధికార కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో నిర్వహించారని, పోలీసులకు కూడా వారికి వత్తాసు పలకడంతో తమకు అన్యాయం జరిగిందని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రైతులు పేర్కొన్న 57 ఎకరాల భూమికి మళ్లీ వేలం నిర్వహించాలని దేవదాయ ధర్మదాయశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియను తొండంగి శివాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారైనా రైతులకు అన్యాయం జరగకుండా కూటిమి పార్టీ నేతల ఒత్తిడి లేకుండా వేలం ప్రక్రియను అధికారులు సామరస్యంగా నిర్వహిస్తారని రైతులు భావిస్తున్నారు.